క్లుప్తంగా

రోడ్డుపైనే మురుగు నీరు



పెంచికలపాడులో ప్రధాన రోడ్డుపై నిలిచిన మురుగునీరు

కోడుమూరు రూరల్‌: గూడూరు మండలం పెంచికలపాడు గ్రామంలో మురుగునీరు వెళ్లేం దుకు కాల్వలేక నిరంతరం ప్రధాన రోడ్డుపైనే నిత్యం ప్రవహిస్తోంది. మురుగునీటి కాల్వలేక నివాస గృహాల్లో ఉపయోగించిన నీటినంతా ప్రజలు ప్రధాన రోడ్డుపైకి వదిలేస్తున్నారు. ప్రధాన రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుం డడంతో వాహనాలు వచ్చి వెళ్లే సమయాల్లో అవి పాదాచారులపై, హైస్కూల్‌కు వెళ్లి వచ్చే విద్యార్థులపై చిమ్ముతుండడంతో ఇబ్బ ప్రజ లతో పాటు, వాహనదారులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ప్రధాన రోడ్డుకు ఇరువైపులా మురు గునీటి కాల్వలను నిర్మించి తమ ఇబ్బందు లను తీర్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కిక్‌ బాక్సింగ్‌లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో నిర్వాహకులు

ఓర్వకల్లు: ఖేలో ఇండియా కిక్‌ బాక్సింగ్‌ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు విద్యానికేతన్‌ కరస్పాం డెంట్‌ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం కర్నూలులోని గ్రీనాప్‌ కిక్‌ బాక్సింగ్‌ ఆకాడ మీలో జరిగిన పోటీల్లో 8 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. ఇందులో మహతి బంగారు పత కం, ముగ్గురు వెండి, ముగ్గురు కాంస్య పత కాలు సాధించారు. విజేతలకు కేవీ విద్యాసం స్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

నివాళి



అనురాధ మృతదేహానికి నివాళులర్పిస్తున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

కల్లూరు: మండల పరిధిలోని ఉలిందకొండ ఎంపీటీసీ–1 అనురాధ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌ సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆది వారం గ్రామానికి వెళ్లి అనురాధ పార్థివదేహా నికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

జేఎన్‌ శేషయ్య ఆశయ సాధనకు కృషి

కర్నూలు(సెంట్రల్‌): సీపీఎం సీనియర్‌ నాయకులు జేఎన్‌ శేషయ్య ఆశయ సాధనకు కృషి చేసినప్పుడే ఆయనకు నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని ఆ పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యుడు ఎంఏ గఫూర్‌ పేర్కొ న్నారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పీఎస్‌ రాధాకృ ష్ణ అధ్యక్షతన సెప్టెంబర్‌ 8న తేదీన మరణిం చిన జేఎన్‌ శేషయ్య సంస్మరణ సభను నిర్వ హించారు.ఆయన చిత్ర పటానికి పూలమా లలు వేసి నివాళులర్పించారు. లలిత కళ సమితి అధ్యక్షుడు పత్తి ఓబులయ్య, నాయ కులు రాజు, ధనుంజయ్య, గురుశేఖర్, ప్రసాదు శర్మ తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి


కర్నూలు(సెంట్రల్‌): నగరంలోని 23వ వార్డు శ్రీరామనగర్‌లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించి మౌలిక వసతులు కల్పించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సంతకాల సేక రణ చేపట్టారు. నగర కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్‌.నరసింహులు, వార్డు సభ్యులు కేవీ జనార్ద న్‌రావు ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో ప్రజల నుంచి సంతకాల సేకరణ చేపట్టారు. ముఖ్యంగా సీసీ రోడ్లు వేయాలని, తాగునీటి సమస్యలను పరిష్కరించాలని, డ్రెయినేజీలు నిర్మించాలని, రోగాల బారిన పడకుండా సీజ నల్‌ వ్యాధుల నివారణకు చర్యలు తీసుకో వాలని ప్రజల నుంచి వినతులు వచ్చినట్లు చెప్పారు. నాయకులు శేషురాజు, ప్రసాదు, సలాంబాషా, మద్దిలేటి, బాషా పాల్గొన్నారు.

మోడరన్‌ పెంటాథ్లాన్‌లో పతకాలు

కర్నూలు (టౌన్‌): కాకినాడ పట్టణంలో ఈనెల 20, 21 తేదీల్లో నిర్వహించిన 9వ రాష్ట్ర స్థాయి మోడరన్‌ పెంటాథ్లాన్‌లో జిల్లా క్రీడాకారులు పతకాలు సాధించి మూడవ స్థానంలో నిలిచి నట్లు జిల్లా మోడరన్‌ పెంటాథ్లాన్‌ అసోసియే షన్‌ కార్యదర్శి అవినాష్‌ ఆదివారం ఒక ప్రకట నలో తెలిపారు. సీనియర్‌ మహిళల విభాగంలో డి.వెంకటేశ్వరి (మొదటి స్థానం), పుష్పా స్వాతి (మూడవ స్థానం), జూనియర్‌ విభాగంలో షేక్‌ సమీయ తస్లీమ్‌ (మొదటి స్థానం), మిక్స్‌డ్‌ రిలే సీనియర్‌ విభాగంలో ఎం.ప్రవీణ్‌కుమార్‌ మొదటి స్థానంలో నిలిచినట్లు వెల్లడించారు.

చదువుల తల్లి వల్లెలాంబదేవి

- నేటి నుంచి ఆలయంలో శరన్నవరాత్రోత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



వల్లెలాంబదేవి



ప్రశాంత వాతావరణంలో వల్లెలాంబదేవి ఆలయం

కోడుమూరు రూరల్‌: కోడుమూరు పట్టణంలో హంద్రీ నది ఒడ్డున వెలసిన వల్లెలాంబదేవి చదు వుల తల్లిగా విరాజిల్లుతోంది. అమ్మవారి సన్నిధిలో చదువుకున్నా, ఆశీస్సులు పొందినా మంచి మార్కు లొస్తాయని, ఉన్నత ఉద్యోగాలొస్తాయన్నది ఇక్కడి ప్రజల ప్రగాఢ విశ్వాసం. ఈ ప్రాంతంలో ఉన్నత చదువులు, ఉద్యోగాలకు సిద్ధమయ్యే చాలామంది విద్యార్థులు, యువకులు అమ్మవారి ఆశీస్సులు తీసుకుని వెళుతుంటారు. అలాగే చిన్నారులకు తమ తల్లిదండ్రులు అమ్మవారి సన్నిధిలోనే అక్షరా భ్యాసం చేయిస్తుంటారు. అమ్మవారి మీద విశ్వాసంతో ఏడాదికేడాది దర్శించుకునే విద్యార్థుల సంఖ్య పెరిగిపోతుండడంతో వల్లెలాంబదేవి ఆలయం సీమ బాసరగా విరాజిల్లుతోంది.

మొదటి వల్లె సమర్పించడం వల్లే..

క్రీ.శ 1036లో చాళుక్య రాజు సత్యాశ్రయుని కాలం లో వల్లెలాంబదేవి ఆలయం నిర్మించినట్లు ఇక్కడి శిలాశాసనం ద్వారా తెలుస్తోంది. గ్రామంలో వ్య వసాయం చేసే వారికి ఈమె కుల దేవత అని వారు నేసిన మొదటి వల్లెను అమ్మవారికి సమర్పించే వారు గనుక వల్లెలాంబ అని ప్రతీతి. దేవాలయం లో నాటి పండితులు శిష్యులచే వేదాలు వల్లె వేయించేవారు గనుక ఈ దేవిని వల్లెలాంబ అని పేరు వచ్చిందనేది మరో అభిప్రాయం.

వల్లెలాంబదేవి మహిమలు

గొల్లాపిన్ని కవి పండిత వంశానికి వల్లెలాంబదేవి కులదేవత. వీరి వంశీయుడైన మోటప్ప అనే బ్రాహ్మణుడికి విద్య అబ్బలేదు. నిరక్షరాస్యుడు అని ఎగతాళి చేస్తుంటే సహించలేని ఆతడు ఓ రోజు రాత్రి వల్లెలాంబ గుడిలో తలుపులు బిగిం చుకుని కూర్చున్నాడు. రాత్రి వేళ నగర సంచా రానికి వెళ్లి తిరిగి వచ్చిన వల్లెలాంబదేవి గుడి తలుపులు తీయకుండా మొండికి కూర్చున్న మోటప్పను హంద్రీ నదిలోకి విసిరికొట్టింది. తిరిగి మరుసటి దినం కూడా ఆతడు గుడిలో తలుపులు బిగించుకుని కూర్చున్నాడు. అమ్మ వారు తిరిగి ఆతడిని హంద్రీ నదిలోకి విసిరికొట్టిం ది. ఇలా మూడు రోజులు జరిగాకా మోటప్ప పట్టుదలను గమనించి అమ్మవారు ఆతడి నమ స్యను తెలుసుకుని సంపూర్ణ అక్షరజ్ఞానం కలిగిం చడమేగాక, ఆ వంశానికి సంబంధించి ఏడు తరాలు పండిత పుత్రులుగా విరాజిల్లుతారని ఆశీ ర్వదించినట్లు గొల్లాపిన్ని వంశస్తుల కథనం. గొల్లాపిన్ని వంశస్తులు హైదరాబాద్, బెంగుళూరు, నంద్యాల, అనంతపురం ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఏడాదికోసారి వచ్చి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి వెళుతుంటారు.

నేటి నుంచి శరన్నవరాత్రోత్సవాలు

దసరా పర్వదినాన్ని పురస్కరించుకొని వల్లెలాం బదేవి ఆలయంలో ఈ నెల 22వ తేదీ నుంచి 2వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలను నిర్వ హించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్, జెడ్పీ టీసీ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి తెలిపారు. ఆలయంలో 11 రోజుల పాటు అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు, దాతల సహకారంతో ప్రతి రోజు వేలాది మంది భక్తులకు అన్నదానం చేయడం జరుగుతుందన్నారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్‌): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడి టోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్‌ డాక్టర్‌ ఏ.సిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమ స్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకో వాలని సూచించారు. అలాగే అన్ని మండల, డివిజనల్, మునిసిపల్‌ కార్యాలయాల్లో అధికా రులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆమె వివరించారు.

అర్జీల సమాచారం కోసం 1100 నంబర్‌

పీజీఆర్‌ఎస్‌లో సమర్పించిన అర్జీ పరిష్కారం కాకు న్నా, పరిష్కారం ఏ దశలో ఉందో తెలుసుకోవాలన్నా 1100 నంబర్‌కు ఫోన్‌ చేసి తెలుసుకోవచ్చని కలెక్టర్‌ సూచించారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకో వడానికి అవకాశం కల్పించినట్లు ఆమె తెలిపారు.


కర్నూలు (టౌన్‌): నగరపాలక సంస్థ నూతన కౌన్సిల్‌ హాలులో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వ హించనున్నట్లు కమిషనర్‌ పి.విశ్వనాథ్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏమైనా సమస్యలు ఉంటే లిఖితపూర్వ కంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.

గిట్టుబాటు ధర కల్పించకపోవడం దారుణం



ఉల్లి పంటను పరిశీలిస్తున్న ఏపీ రైతు సంఘం నాయకులు

కల్లూరు: ఉల్లి, టమాట, పత్తి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్‌ రైతు సంఘం కర్నూలు జిల్లా సహాయ కార్యదర్శి డి. శ్రీనివాస రావు డిమాండ్‌ చేశారు. ఆదివారం ఏపీ రైతు సం ఘం ప్రతినిధులు కల్లూరు మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. పెద్దటేకూరు గ్రామంలో మహేష్, రాముడు సాగు చేసిన పత్తి, ఉల్లి పంటలను పరిశీలించారు. అలాగే కె. మార్కాపురం, చిన్నకొట్టాల, పెద్దకొట్టాల గ్రామాల్లో ఉల్లి పంటలను పరిశీలించి రైతులు పడు తున్న బాధలను తెలుసుకున్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉల్లి క్వింటా రూ. 1,200, టమాట కేజీ రూ. 8 చొప్పున కొనుగోలు చేస్తామని చెప్పడం వల్ల రైతులకు ఏమాత్రం గిట్టు బాటు కాదన్నారు. ఉల్లిని క్వింటా రూ.3వేలు, పత్తి క్వింటా రూ. 10వేలు, టమాట కేజీ రూ. 20 ప్రకారం కొనుగోలు చేయాలన్నారు. అలాగే రైతులు దిగుబడులను అరబెట్టడానికి, వర్షాలు వస్తే ధాన్యం కప్పుకోవడానికి టార్పాలిన్ పట్టాలు ఇవ్వాలన్నారు. ఏపీ రైతు సంఘం నాయకులు దొడ్డిపాడు బాషా, పుల్లన్న, రాముడు పాల్గొన్నారు.



రైతు కష్టం గొర్రెలపాలు!



ఉల్లి పంటను గొర్రెలకు మేతగా వదిలేసిన దృశ్యం

- రూ. 5 లక్షలు నష్టపోయిన ఉల్లి రైతు

ఉల్లి పంటను గొర్రెలకు మేతగా వదిలేసిన దృశ్యం కోడుమూరు సమీపంలో కనిపించింది. కోడుమూరుకు చెందిన మీనిగ నడిపి గిడ్డయ్య అనే రైతు ఎకరాకు రూ.12వేల చొప్పున కౌలు చెల్లించి 8 ఎకరాల్లో ఈ ఏడాది ఉల్లి పంట సాగు చేశాడు. ఇప్పటి వరకు రూ. 5 లక్షల వరకు పెట్టుబడి పెట్టాడు. తీరా దిగుబడులు చేతికొచ్చే సమయానికి మార్కెట్లో క్వింటా ఉల్లి ధర రూ.200 కూడా లేదు. ప్రభుత్వం ఎంతో గొప్పగా చెప్పుకుంటున్న క్వింటా రూ.1200 మద్దతు ధర గిట్టుబాటు గాకపో వడంతో చేసేది లేక 8 ఎకరాల్లో సాగు చేసిన ఉల్లి పంటను గొర్రెలకు మేతగా వదిలేశాడు. 'ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర ప్రకారం అమ్మినా ఉల్లిగడ్డలు కోసిన కూలీలకు ఆ డబ్బు సరి పోదు. చేసేదేమీ లేక పంటనంతా గొర్రెలకు వద లేశా. ఇన్నేళ్ల కాలంలో ఇలాంటి పరిస్థితి ఎప్పుడూ చూడలేదు' అని రైతు మీనిగ నడిపి గిడ్డయ్య కన్నీటి పర్యంతమయ్యారు.

ఉల్లి దిగుబడులను చూపుతున్న రైతు మీనిగ నడిపి గిడ్డయ్య

– కోడుమూరు రూరల్‌

నిర్వహణ అధ్వానం.. అవస్థల ప్రయాణం

- కర్నూలు – చిత్తూరు హైవే నిర్వహణ గాలికి..
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు
- తరచూ బ్రిడ్జి కింద నీరు
- పూడిపోయిన కాల్వలు



జగ్గాపురం వద్ద హైవేపై నిలిచిన నీరు



మార్కెట్‌యార్డు వద్ద వీయూపీ వద్ద వర్షపునీరు

పాణ్యం: కర్నూలు–చిత్తూరు జాతీయ రహదారి నిర్వహణ నానాటికీ అధ్వానంగా మారుతోంది. రహదారిపై వర్షపు నీరు నిల్వ ఉన్నా తొలగించే దుకు హైవే అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. డివైడర్లలో గడ్డి తొలగించడం తప్ప మర మ్మతులపై కనీస శ్రద్ధ చూపకపోవడంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. గత కొన్నేళ్లుగా వంతె నల కింద వర్షపు నీరు నిల్వ ఉండి దుర్వాసన వెదజ ల్లుతున్నా అధికారులు నిర్లక్ష్యం కొనసాగుతూనే ఉ ది. ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎన్ని సార్లు సమ స్యను ప్రస్తావించినా హైవే అధికారులు వచ్చి చూసి వెళ్లిపోవడమే తప్ప ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. దీంతో వాహనదారులు, పాదచారులు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అసంపూర్తి కాల్వలు.. చెరువుల్లా బ్రిడ్జిలు

పాణ్యం బస్టాండ్‌ వద్ద ఉన్న వీయూపీ (వెహికల్‌ అండర్‌పాస్‌) బ్రిడ్జి కింద నీరు వెళ్లే కాల్వలు అసం పూర్తిగా ఉండడమే కాక, ఉన్నవి కూడా పూడిపో యాయి. ఇరువైపులా రోడ్డు ఎత్తులో ఉండడంతో వర్షం కురిసినప్పుడల్లా నీరు బ్రిడ్జి కింద చేరి చెరు వులా నిలిచిపోతోంది. ఇదే దుస్థితి మార్కెట్‌యార్డు వద్ద, నెరవాడ మెట్ట వద్ద ఉన్న పీయూపీలలోనూ (పబ్లిక్‌ అండర్‌పాస్‌) కనిపిస్తోంది. ఒక్కసారి వర్షం పడితే రోజుల తరబడి నీరు ఎండిపోక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

సర్వీస్‌ రోడ్లు దారుణం

హైవే అధికారులు నిర్వహణను పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నారు. మార్కెట్‌యార్డు ఫ్లైఓవర్‌ వద్ద స్తంభాలకు దీపాలు అమర్చినా అవి వెలగక నెలల తరబడి చీకట్లో వాహనదారులు ప్రయాణిస్తున్నారు. వర్షపు నీరు నిలిచినా తొలగించేందుకు ఎలాంటి చర్యలు తీసుకో వడం లేదు. సర్వీస్‌ రోడ్ల పరిస్థితి మరింత దారుణం గా ఉండడంతో వాహనదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు. ఇప్పటికైనా హైవే అధికారులు మేల్కొని రహదారి నిర్వహణ సక్రమంగా చేసి శాశ్వత పరిష్కారం చూపించాలని డిమాండ్‌ చేస్తున్నారు.

పరిష్కార వేదికకు అధికారులందరు హాజరవ్వాలి

సి.బెళగల్‌: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్‌) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరు తప్పనిసరిగా హాజ రవ్వాలని తహసీల్దార్‌ వెంకటలక్ష్మి ఆదేశించారు. ఆమె ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకు స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారు లతో కలిసి పీజీఆర్‌ఎస్‌ కార్యక్రమం నిర్వహించడం జరుగుతోందని, కార్యక్రమానికి మండల అధికారు లందరు తప్పకుండా హాజరుకావాలని సూచిం చారు. హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారు లకు నివేదికలు పంపడం జరుగుతుందని పేర్కొ న్నారు. మండల ప్రజలు ఈ కార్యక్రమాన్ని సద్విని యోగం చేసుకుని, తమ సమస్యలను పరిష్కరించు కోవాలని సూచించారు.

దసరా ఉత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు

పాణ్యం: మండలంలో దసరా ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమవుతాయని దేవ దాయశాఖ ఈఓ సువర్ణ తెలిపారు. స్థానిక ఆం జనేయస్వామి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబర్‌ 1 వరకు అమ్మవారు ప్రతిరోజు వివిధ అవతారాల్లో భక్తులకు దర్శనమిస్తారని చెప్పారు. 22న శ్రీదేవి అలంకరణ, 23న గౌరిదేవి, 24న పార్వతిదేవి, 25న శ్రీరాజరాజేశ్వరిదేవి, 26న అన్నపూర్ణదేవి, 27న లలితాదేవి, 28న కాత్యాని దేవి, 29న సరస్వతిదేవి, 30న దుర్గాదేవి, 1న మహాలక్ష్మీ దేవిగా అమ్మవారు పూజలందుకోను న్నారు. 2వ తేదీన గ్రామోత్సవం నిర్వహిస్తాము న్నారు. ఆలయాన్ని ప్రత్యేక అలంకరణతో సిద్ధం చేసినట్లు తెలిపారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్‌): ఆస్తి ఉందన్న మదంతో కుమా రుడిని చంపి, భార్యపై హత్యాయత్నం చేసిన దేవన కొండకు చెందిన నరేష్, అతని కుటుంబ సభ్యులపై చర్యలు తీసుకోవాలని ఐద్వా రాష్ట్ర నాయకురాలు కె.అరుణ డిమాండ్‌ చేశారు. ఐదేళ్ల నరేష్‌ చేతిలో హత్యాయత్నానికి గురై దావుటకుట మధ్య ఓ ప్రైవేట్‌ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న భార్య గ్రాజణిని ఐద్వా, డీవైఎఫ్‌ఐ, సీపీఎం నాయకులు పరామర్శించారు. వారు మాట్లాడుతూ.. భవిష్యత్‌ లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా నిం దితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి పి.ఎస్‌ సుజాత, ఎండీ ఆనంద్‌ బాబు, నూరి, హుస్సేన్‌బాషా, బాబీ పాల్గొన్నారు.

ఉల్లి రైతును నట్టేట ముంచిన ప్రభుత్వం

కర్నూలు(సెంట్రల్‌): కూటమి ప్రభుత్వం ఉల్లి రైతును నట్టేట ముంచిందని, ఆదుకుంటామని చెప్పి మోసం చేసిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ఉల్లి రైతులను ఆదుకోలేదన్నారు. ఉల్లి క్వింటా లకు రూ.1200 ప్రకారం రైతులకు ఇవ్వాలన్నారు. అంతేకాక ప్రస్తుతం ఇస్తామన్న ఎకరాకు రూ.20 వేలు కూడా ఇప్పటికీ ఇవ్వకుండా జాప్యం చేస్తున్నా రనితే చేతిక వస్తాయన్నారు. జిల్లాలో ఉల్లి రైతులను ఆదుకోవడానికి మంత్రి టీజీ భరత్‌ చర్యలు తీసుకో వాలని కోరారు.

జేసీబీల స్టాండ్‌!



రోడ్డు పక్కన నిలిపిఉంచిన జేసీబీలు

కల్లూరు: సాధారణంగా బస్టాండ్, ఆటోల స్టాం డ్‌ చూసి ఉంటాం. అయితే కర్నూలు నగరం నంద్యాల చెక్‌పోస్టు సమీపంలో కేంద్రీయ విద్యాలయం పక్కన జేసీబీలు వరుసగా నిలిపి ఉన్నాయి. ఆ దృశ్యం చూపరులకు జేసీబీల స్టాండ్‌ను తలపిస్తోంది. ఆ మార్గంలో ప్రయాణించే వారు వరుసగా ఉన్న జేసీబీలను చూసి ఇదేదో జేసీబీల స్టాండ్‌లా ఉందే అను కుంటూ వెళుతున్నారు.

భగవద్గీత పోటీలు



మాట్లాడుతున్న శ్రీధర్‌

కర్నూలు కల్చరల్‌: దేవీ శరన్నవరాత్రుల సందర్భం గా అరోరా నగర్‌లోని రాజరాజేశ్వరి దేవి ఆలయం లో ఆదివారం భగవద్గీత పోటీలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎం.శ్రీధర్‌ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 106 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ.. విద్యార్థులు భగవద్గీత శ్లోకాలను వాటి తాత్ప ర్యాలను సంపూర్ణంగా అర్థం చేసుకొని జీవితంలో పాటించడానికి ప్రయత్నించాలన్నారు. కుటుంబ ప్రబోధన్, సామాజిక సమరసత, పర్యావరణ పరిర క్షణ, పౌర విధులు, స్వదేశీ స్వావలంబన లాంటి పంచ పరివర్తన్‌ ద్వారా ఇది సాధ్యపడతాయన్నారు. విజేతలకు అక్టోబర్‌ 1న బహుమతులు అందజేస్తా మన్నారు. పోటీలకు శరత్‌ చంద్ర, అనిల్, వనజ, పార్వతి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. కమిటీ సభ్యులు సురేష్‌కుమార్, సాయినాథ్, షణ్ముఖ కృష్ణ, చంద్రశేఖర్, కోదండ రామయ్య, ఎల్లయ్య శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఇలా ఉంటే రోగాలు రావా?



ఇళ్లకు సమీపంలో ఖాళీ స్థలంలో నిలిచిన నీరు

కల్లూరు: కర్నూలు నగరం నంద్యాల రోడ్డు నుం చి దిన్నెదేవరపాడు రోడ్డును కలిపే వంద అడు గుల రోడ్డు పక్కన ఖాళీ స్థలాల్లో వర్షం నీరు నిలు స్తోంది. నీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు, లార్వాలకు నెలవుగా మారింది. దోమలు, ఈగల వృద్ధి చెంది వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు.

మానవాళి శ్రేయస్సే జేఐహెచ్‌ ధ్యేయం



మాట్లాడుతున్న మొహమ్మద్‌ అక్తర్‌బాషా

కర్నూలు(అర్బన్‌): దేశంలోని వివిధ ప్రజల మధ్య సుహృద్భావం, మత సామరస్యం, శాంతితో పాటు ఒకరి మధ్య ఒకరికి సహకారం అందిస్తూ సర్వ మానవాళి శ్రేయస్సే ధ్యేయంగా జమాతే ఇస్లామీ హింద్‌ (జేఐహెచ్‌) పనిచేస్తోందని సంస్థ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్‌ అక్తర్‌బాషా అన్నారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జమాతే ఇస్లామీ మీడియా ఓరియంటేషన్‌ కార్య క్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ.. దేశం లో 25 కోట్లకు పైగా ముస్లింలు ఉన్నారని, వారం తా రాజ్యాంగ ఫలాలు సక్రమంగా పొందిన మైనారి టీలని చెప్పారు. రాజ్యాంగం ప్రతి పౌరునికి సమాన హక్కులు ఇస్తుందని, అల్ప సంఖ్యాకు లను తేడా లేకుండా సమానత్వం కల్పించడంలో మీడియా తన పాత్రను పోషించాలన్నారు. వక్ఫ్‌ సవరణ చట్టంపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కొం తవరకు ఉపశమనం కలిగించిందన్నారు. అయితే వక్ఫ్‌ సవరణ చట్టంలో ఉన్న లోపభూయిష్టమైన అంశాలను పూర్తిగా రద్దు చేయాలని ఆలిండియా ముస్లిం పర్సనల్‌ లా బోర్డు ఇచ్చిన పిలుపునకు దేశంలోని అన్ని ముస్లిం సంస్థలు మద్దతు తెలియ జేశాయన్నారు. సంస్థ రాష్ట్ర సభ్యులు మహమ్మద్‌ ఇబ్రహీం, పరీఫ్, స్థానిక అధ్యక్షుడు దాండ్‌బాషా, రహీం తదితరులు పాల్గొన్నారు.

మహిళల హక్కుల కోసం ఉద్యమించాలి



మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్‌): మహిళల హక్కుల కోసం ఉద్య మించాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సం ఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల పిలుపు నిచ్చారు. ఆదివారం జీవీ ఫంక్షన్‌ హాలులో రహీదా అధ్యక్షతన ఐద్వా నగర మూడో మహాసభలు జరిగాయి. ముందుగా సీనియర్‌ నాయకురాలు ఖమ్మర్‌ జెండాను ఆవిష్కరించారు. ముఖ్యఅతి థిగా హాజరైన పి.నిర్మల మాట్లాడుతూ.. రాష్ట్రంలో మద్యం ఏరులై పారుతూ మహిళలకు ప్రాణ సంక టంగా మారిందన్నారు. కొందరు తాగి వచ్చి మహి ళలను హింసిస్తున్నారని, మద్యాన్ని అరికట్టడంలో ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. విచ్చల విడిగా మద్యం పాలసీలు తెచ్చి మహిళలకు తీవడంతోపాటు బెల్టు షాపులను కూడా తీసుకొచ్చి మహిళల ఇబ్బందులకు కూటమి ప్రభుత్వం కారణ మవుతోందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం లో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని, ప్రతి రోజూ ఎక్కడో ఒకచోటా మహిళలపై హత్యలు, అత్యాచారాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు సీఎం చంద్రబాబునాయుడు మహిళలకు నెలకు రూ.1500 ఇస్తానని చెప్పి మోసం చేస్తున్నారని మండిపడ్డారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యద ర్శులుగా డి.రషీదాబేగం, బంగి పద్మావతితో పాటు 21 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

సాహితీ సంఘం సంస్మరణ గురజాడ

కర్నూలు కల్చరల్‌: 20వ శతాబ్దంలో తన రచనల ద్వారా సంఘంలో గొప్ప మార్పు తెచ్చిన సం స్కర్త గురజాడ అప్పారావు అని టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య అన్నారు. ఆదివారం సీక్యాంప్‌ టీజీవీ కళాక్షేత్రంలో గురజాడ అప్పా రావు జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా పత్తి ఓబులయ్య మాట్లా డుతూ.. గురజాడ రచించిన దేశభక్తి గేయం, కన్యాశుల్కం నాటిక ద్వారా ఆదునిక సాహిత్యాన్ని ప్రజలకు పరిచయం చేశారన్నారు. ఆనాటి సాం ఘిక దురాచారాలపై ఆయన రాసిన కన్యాశుల్కం నాటకం ఒక సంచలనమన్నారు. దేశమంటే మట్టి కాదోయ్‌ దేశమంటే మనుషులోయ్‌ అని పేర్కొ న్నారన్నారు. కళాక్షేత్రం కార్యదర్శి యాగంటీశ్వర్, సభ్యులు గురుమూర్తి, కేవీ రమణ, సంగా ఆంజ నేయులు, జీవీ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వెయిట్‌ లిఫ్టింగ్‌లో సత్తా

కర్నూలు (టౌన్‌): గుం టూరు పట్టణంలో ఈ నెల 20, 21 తేదీల్లో అం డర్‌–14 బాలుర విభా గంలో నిర్వహించిన ఆంధ్రప్రదేశ్‌ రాష్ట్రస్థాయి వెయిట్‌ లిఫ్టింగ్‌ చాంపి యన్‌షిప్‌ పోటీల్లో కర్నూలు క్రీడాకారులు ప్రతిభ చాటారు. 79 కేజీల విభాగంలో ఆధిత్ (బంగారు), హైజాన్‌ (కాంస్యం), ఇం తియాజ్‌ (కాంస్యం) పతకాలు సాధించారు. వారిని అసోసియేషన్‌ నాయకులు ప్రత్యేకంగా అభినందించారు.